# డిసెంబర్ సంధ్యలమధ్య



ఆదివారం మధ్యాహ్నం ముష్టాడి అరుపుతో పగటి నిద్ర తేలిపోయింది లాయర్ చంద్రశేఖరరావుకి. దుప్పటి తొలగించి లేచారు. శీతాకాలం - పగలే చలిగా వుంటుంది. నిద్రపోయే ముందు దుప్పటి కప్పుకోలేదు. బహుశా నిద్రలో లాక్కుని కప్పుకునుండొచ్చు!

బాల్కనీలో కొచ్చి కూర్చున్నారు.

అరుంధతి టీ తెచ్చింది.

టీ తాగుతూ కింది మెట్లమీద ఎండలో నిలబడి ఆరుస్తున్న ముష్టి




కుర్రాణ్ణి చూస్తున్నారు.

తనలాగే తెల్లగా వున్నా తనంత లావుగా లేడాకుర్రాడు. ఆ మాటే అరుంధతితో అంటే—

"ఛ ముష్టాడితో పోల్చుకోడం ఏమిటీ?" విసుగ్గా అని అక్కడి నుంచెళ్ళి పోయింది తన భార్య అరుంధతి.

రావుగారు నవ్వుకుని టీ కప్పు కింద పెట్టి, సిగరెట్ తీశారు.

ఆ ముష్టి కుర్రాడికి పదిహేనేళ్ళుంటాయ్. రంగు రంగుల పూసల దండలూ, సూది, పిన్నీసుల గుత్తులూ మెడలో వేసుకున్నాడు. కుడి భుజానికి జోలె. వీళ్ళని ముష్టాళ్ళు అనరు - గంగిరెద్దవాళ్ళు వీళ్ళు.

వీళ్ళలో కాస్త స్థితిపరులు ఒక

ఎద్దుని రకరకాల పూసల దండల్తో, రంగు రంగుల గుడ్డలతో అలంకరించి, ముఖానికి పసుపు పూసి, బొట్లు పెట్టి, పొడుగాటి బూరల్ని వాయిస్తూ, డప్పులు మోగిస్తూ, పల్లెటూళ్ళల్లో కాస్త దర్జాగా ముస్తైత్తుకుంటారు. వీళ్ళలోనే మరీ తక్కువ రకంవాళ్ళు యిలా పూసల దండలూ, దూడలకి మెడలో కట్టడానికి వెంట్రుకల తాళ్ళూ అమ్ముకుని, అడుక్కుని బ్రతుకుతారు. ఆ జాతివాడే ఆ కుర్రాడు. వీళ్ళ పద్ధతులు కాస్త గమ్మత్తుగా వుంటాయ్.

మరో వీధిలో అడుక్కుంటూ వచ్చిన వీళ్ళ జాతి ఆడమనిషి ఈ కుర్రాడ్ని రావుగారి ఇంటి ముందు కల్సి 'రా పోదాం' అని తీసుకుపోతుంది. ఆమె వాడి తల్లిలా వుంది. చేతిలో పెద్ద బుట్టా, మెడలో ముదురు రంగు పూసల దండలూ వున్నాయ్. ఆమె అస్పష్టంగా కన్పించింది రావుగారికి.

బాల్కనీలో కుర్చీలోంచి లేచి పిట్టగోడ దగ్గరగా వెళ్ళి స్పష్టంగా ఆమెని చూసే ప్రయత్నం చేశారు రావుగారు - కన్పించింది.

ఆమె....

రావుగారికి తెల్సు. చాలా ఏళ్ళయినా పేరు బాగా గుర్తుంది - కలికి.

ఒకానొక రోజున కలికి చాలా అందంగా వుండే రోజుల్లో, యిదే వేషధారణలో వున్నా చక్కని లాలిత్యంతో తన ముందు తారట్లాడింది.

ఆ రోజులన్నీ గుర్తుకు వచ్చేసరికి రావుగారి మనసు మనసులో లేకుండా పోయింది.

కొన్ని జ్ఞాపకాలు తన్మయానందపు వరండాల మెట్ల దగ్గర నుంచోబెడితే, మరి కొన్ని దుఃఖ సాగరం అట్టడుగున ముంచేసి వూపిరి సలపకుండా చేస్తాయ్.

స్నానం చేసి, డ్రస్ చేసుకుని క్లబ్బుకి బయల్దేరారు రావుగారు.

ఒక రోజున యీ అసహ్యం పుట్టించే మనిషితో పెట్టుకున్న సంబంధానికి తనమీద తనకి చాలా ఎలర్జీ పుట్టుకొస్తుంది. ఆ వ్యక్తిని యీ రోజు యింత అసహ్యమైన స్థితిలో చూస్తున్నందుకు జాలీ, గిజాటూ కలగలపుగా పుడ్తున్నాయ్.

ఆయన్ని గతం పీకుతుంది. మనసుని కలిచి వేస్తుంది.

కారు వేగంగా డ్రైవ్ చేస్తున్నారు. క్లబ్బు వేపు వెళ్తుంది.

రోజూ 12 గంటల వరకూ క్లబ్బు నుంచి యింటికి రాని రావు

గారు ఆ దినం 10 కాకుండానే యింటికి మళ్ళారు.

వేగంగానే వెళ్తుంది ఆయన కారు. చలిగాలి.

సరిగ్గా పదహారేళ్ళ క్రితం యిలాంటి చలిగాలిలోనే ఆయన జీవితంలో ఒక సంఘటన జరిగింది.

* * *

మద్రాసులో బి. ఎల్. చేసి వచ్చిన చంద్రానికి ఆ పల్లెటూళ్ళో అసలు కాలక్షేపం గావడం లేదు.

పిఠాపురంలో వున్న ఓ బంధువు కాకినాడలో ఓ లీడింగ్ లాయర్ దగ్గర అప్రంటీస్‌కి రికమెండ్ చేస్తాను, ఒక నెల ఆగమన్నాడు. నెలా యీ వూళ్ళో వుండటం కష్టసాధ్యంగానే వుంది.

సాయంత్రం అయ్యే సరికి చెల్లూరు వంతెన మీద కూర్చునేవాడు. నాలుగు వూళ్ళకి కూడలి అది. సాయంత్రం అయ్యే సరికి వంతెన మీంచి వచ్చే పోయే జనంతో చాలా సందడిగా ఉండేది.

వంతెన కింద ఒక బంగళా పెంకు సత్రం వుంది. దాని ముందు గంగరావి చెట్లు. సత్రం బాగా పాత బడింది. పెంకులు లేచాయ్.

సంక్రాంతి సీజన్లో మల్లికాసుల వాళ్ళూ, గంగిరెద్దులవాళ్ళూ, దొమ్మరాళ్ళూ వస్తుంటారు ఆ సత్రంలోకి. వాళ్ళున్నంత కాలం చాలా సందడిగా వుంటుందా సత్రం - పరిసర ప్రాంతం.

తను యీ వూళ్ళో పుట్టినా ఆ సత్రం ఎప్పుడు కట్టారో తను ఎరగడు.

తన పదేళ్ళ ప్రాయంలో అనుకుంటాను. సంక్రాంతికి ఆ ఊళ్ళో దొమ్మరాట కట్టడానికి వచ్చిన దొమ్మరి గుంపులో ఒక యువతిని చూశాడు. పగటిపూట వళ్ళు విరుచుకుంటూ వూళ్ళో తిరిగేది.

ఒక రాత్రి పెద్దరెడ్డిగారి తోటలోకి ఆ దొమ్మరిదీ, వూళ్ళో సైకిల్ షాపు 'వలీ' వెళ్ళడం చూశాడు. అప్పటి నుంచీ ఆ సత్రం బాగా గుర్తు తనకి.

సాయంత్రమయ్యేసరికి చెల్లూరు వంతెన మీద కూర్చుని ఆ సత్రం వేపు దృష్టి సారిస్తే....

పండగ మూడు రోజులూ వూళ్లో అమ్మి బియ్యం దండుకోవటానికి వాళ్ళు తాటాకులతో చిన్న-చిన్న బుట్టలూ, గిలక్కాయలూ చేస్తూ కన్పించేవారు. కొందరు పొడుగాటి వెంట్రుకల్తో తాళ్ళు పేనుతూ కన్పించేవారు. ఆ గుంపులోనే కన్పించింది కలికి.

మాపి, వాసనొచ్చే ముదురు

రంగు బట్టలూ, చింపిరి జుట్టూ, మట్టి కాళ్ళూ, చంకకి తగిలించుకునే బుట్టా.

పగలంతా చుట్టు పక్కల వూళ్ళల్లో అడుక్కుని, సాయంత్రం చలిగాలి తిరిగే లోపు ఆ సత్రానికి చేరుకుని, ఆ పూట అమ్మి, అడుక్కున్న పూసల దండలూ, వెంట్రుకల తాళ్ళూ తాలూకు డబ్బులూ - బియ్యం లెక్క పెట్టుకుని, కాలవలో నీళ్ళతో ముఖం, చేతులూ కడుక్కుని, గంగరావి చెట్టు కింద కూర్చుని చుట్ట వెలిగించేది.

ఆ దృశ్యం యెంతో అసహ్యకరంగా వున్నా, ఆ అసహ్యంలో అందం కన్పించేది చంద్రానికి. ఇంత జుగుప్స వెనక అందంగా కన్పించేది కలికి.

రోజూ అలా కలికిని చూసేవాడు.

కొన్నాళ్ళకి కలికి అద్భుత సౌందర్యరాశిలా కన్పించింది.

ఆమె చుట్ట పెట్టి కాలుస్తూ తన్మయానందం అనుభవిస్తూంటే, అందులో ఏ ముం దా అని సాయంత్రం వంతెన మీదికి వచ్చే ముందు మున్సబు రెడ్డి కిళ్ళీ కొట్లో రెండు బర్కిలీ సిగరెట్లు తీసుకొచ్చేవాడు కూడా.

తను కలికిని చూస్తున్నాడన్న సంగతి కలికికీ తెల్సింది కొద్ది రోజులకి.

బాగా పొద్దు పోయాక, ఆ చీకట్లో ఆ వంతెన మీద తనున్నాడనే సంకేతానికి సిగరెట్ వెలిగించేవాడు. సిగరెట్ నిప్పు ఎర్రగా కలికికి కన్పించేది.

రోజూ సాయంత్రం యెప్పుడవుతుందా అని చూసేవాడు.

ఒక రాత్రి....

ఊరు మాటు మణిగిందప్పటికే. అచ్యుతాపురం దెయ్యాల బస్సు కూడా వెళ్ళిపోయింది. నిశ్శబ్దాన్ని చీల్చుకుని దూరంగా వున్న లాకుల్లో నీళ్ళ రొద. ఆ రాత్రి దాదాపు అర డజను సిగరెట్లు కాల్చాడు. గ్యారంటీగా కలికి వస్తుందీ రాత్రి. అదే అంచనా కొచ్చాడు.

అనుకున్న ప్రకారం 11 గంటల ప్రాంతంలో వచ్చింది.

చవక రకం మనిషి అనుకున్నాడు.

"నిప్పుందా?"

అగ్గిపెట్టిచ్చాడు.

అగ్గిపెట్టి తీసుకుని, తిరిగివ్వకుండానే వెళ్ళిపోయింది.

మరుసటి రోజు కాస్త ధైర్యం వచ్చింది.

సాయంత్రం కాగానే చుట్ట

కాలుస్తూ తనని చూస్తూ నవ్వింది.

రహస్యంగా చిన్న సైగ చేశాడు.

మళ్ళీ నవ్వింది చుట్ట వుమ్మేస్తూ.

ఆ రాత్రి....

తన దగ్గర కొచ్చింది.

వంతెన కింద రైసు మిల్లు అవతలకి నడిచాడు.

తనని అనుసరించింది.

ఇటిక బట్టీ దగ్గర మామిడి చెట్టు కింద వూక తోలే బండి కన్పించింది.

బండి తొట్లో కెళ్ళి కూర్చు న్నాడు.

వచ్చి తన పక్కన కూర్చుంది.

అక్కడంతా నిశ్శబ్దం, నిర్జన మయం.

"నిన్ను ముట్టుకో వచ్చా?" అంది.

తను నవ్వి సిగరెట్ వెలి గించాడు.

కలికికి దగ్గరగా వెళ్ళాడు.

కలికి నోట్లోంచి చుట్ట వాసన, వంటినుంచి చెమట వాసన.

తను పేనే వెంట్రుకల తాడులా కలికి అల్లుకుపోయింది.

పది రూపాయలు తీసిస్తే....

"డబ్బుల కోసం వచ్చానా? అసలు నే నలాంటి మడిసినా??" అంది.

సిగ్గుపడ్డాడు.

"రోజూ వస్తావ్‌గా?" అంది.

"ఆఁ" అన్నాడు.

"అలాగే సాయంత్రం కోసం చూస్తూ రోజూ వెళ్ళేవాడు. తనకి

---


# విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 18 రూ॥ |
| విడి ప్రతి | 3 రూ॥ |

పూసల దండలు రకరకాల రంగు లవి కానుక లిచ్చింది.

"రేపు నీకో మాట చెప్తాను - వస్తావ్‌గా?" అంది ఆ రాత్రి.

"ఆఁ" అన్నాడు. కానీ....

కలికి రమ్మన రేపు అన్న రోజు పిఠాపురం బంధువొచ్చి, కాకినాడ లాయరు దగ్గరకి తీసుకెళ్ళాడు.

ఆ తరువాత కొన్ని నెలలకి తనా వూరు వస్తే మండే వేసవి సాయంత్రంలో పొద్దైన పెంకుటి సత్రంలో కలికి కన్పించ లేదు.

చూచాయగా అరాతీస్తే....

"పండుగ సీజనైపోయిందిగా - పోయారు" అన్నారు.

ఆ తరువాత చాలా డిసెంబరు సీజన్లొచ్చాయ్ గానీ, కలికి కన్పించ లేదా సత్రంలో.

అంతర్గతంగా ఆలోచించే వాడు.....

స్త్రీతో ఆ రకం సంపర్కం తనకి అదే ఆఖరిసారీ, మొదటి సారినీ. ఆ స్త్రీకి అన్యాయం లాంటిది చేశానని బాధ పడేవాడు. ఏదైనా న్యాయం చెయ్యాలని ఆలోచించేవాడు.

కలికి మనసులో ఏం వుందో అతను ఎంతగా యోచించినా అవ గతం అయ్యి చచ్చేది కాదు.

కలికి గుండెల్లో ఏం వున్నా జీవితంలో మళ్ళీ ఆ ఆడది కన్పిస్తే ఏదైనా న్యాయం చెయ్యాలి.... చెయ్యాలి.

ఇది ఎప్పటికీ తనలో మిగిలి పోతున్న ఆలోచన.

చాలా ఏళ్ళ తర్వాత కొడుకుతో యీ రోజు కన్పించింది కలికి.

ఆమె ఆంతర్యంలో ఏమున్నా ఆమెకి న్యాయం చెయ్యాలి. చెయ్యడం న్యాయం.

* * *

పెద్ద శబ్దం.

కారు డ్రైవ్ చేస్తున్న లాయర్ చంద్ర శేఖరరావుగారు గతం నుంచి వర్తమానానికీ, వాస్తవానికీ వొచ్చి చూస్తే....

తన కారు యాక్సిడెంటయింది.

కారు కింద ఆ గంగిరెద్దు మనిషి కలికీ - ఆమె కొడుకూ.

కారు రోడ్డుకి రాంగ్ సైడ్‌ని, ఒక తురాయి చెట్టు కింద ఆద మరచి నిద్రోతున్న కలికీ, ఆమె కొడుకు మీదికి వెళ్ళిపోయింది.

లాయర్ రావుగారు గత స్మృతుల్లో వుండగా ఆయన కారు ఆ రకంగా తీర్పిచ్చి కర్మ ముగింప జేసింది.

కానీ రావుగారికి ఏనాటికీ అంతు పట్టని సమస్య....

కలికి మనసులో ఏముందీ?.... ఏముందీ??

*